క్లుప్తంగా

పెంచలకోనలో 16న రథ సప్తమి



పెంచలకోన దేవస్థానం

రాపూరు : ప్రముఖ పుణ్య క్షేత్రం పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 16వ తేదీన రథ సప్తమిని ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారు ఒకే రోజు ఏడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారని పేర్కొన్నారు. 16 ఉదయం 4 గంటలకు స్వామికి అభిషేకం, 6 గంటలకు సూర్యప్రభ, 8 గంటలకు శేషవాహనం, 10 గంటలకు సింహ వాహనం, 12 గంటలకు బంగారు గరుడ వాహనంపై స్వామి విహరిస్తారని తెలిపారు. అదేవిధంగా 2 గంటలకు చక్రస్నానం, 4 గంటలకు బంగారు హనుమంత వాహనం, సాయంత్రం 6 గంటలకు అశ్వ వాహనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనం ఉంటాయని తెలిపారు.

నేలపట్టును పీడిస్తున్న జ్వరాలు

దొరవారిసత్రం : నేలపట్టు గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీలో పది రోజులుగా జ్వరాలు ప్రబలడంతో ప్రజలు అల్లాతుడున్నారు. ప్రతి ఇంటిలోనూ ఒకరు జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. సంబంధిత పంచాయతీ పాలకులు, వైద్యులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సూళ్లూరుపేట పాఠశాల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని తయారు చేసిన హ్యాండ్ వాషింగ్ మెషిన్‌ను చూపిస్తున్న ఉపాధ్యాయురాలు

సూళ్లూరుపేట రూరల్ : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.వర్షిని తయారు చేసిన ఆటోమేటిక్ హ్యాండ్ వాషింగ్ మెషిన్ ప్రశంసలు అందుకున్నట్టు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆటోమేటిక్ హ్యాండ్ వాషింగ్ మెషిన్ ప్రాజెక్టుకు గైడ్ ఉపాధ్యాయులుగా అనూష వ్యవహరించారని పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు అక్బర్, సునీల విద్యార్థినిని అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నాలుగు ప్రాజెక్టులు



కల్లూరు పాఠశాల విద్యార్థిని వైష్ణవికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు

దొరవారిసత్రం : శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో డీవీ సత్రం మండలం పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన నాలుగు ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. ఇందులో కల్లూరు జెడ్పీ పాఠశాలకు చెందిన రెండు ప్రాజెక్టులు, శ్రీధనమల్లి, పూలతోట జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కొక్కటి ఉన్నట్టు తెలిపారు. డీవీ సత్రం నుంచి 14 ప్రాజెక్టులు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో నిలిచాయి. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రసంసా పత్రాలు, షీల్డ్స్ అందజేశారు.

సెబ్ ఎస్‌ఐపై దాడి

వాకాడు : మండలంలోని అంజలాపురం వద్ద నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై ఎస్‌ఈబీ పోలీసులు ఆదివారం దాడి చేశారు. అయితే పోలీసులపై పందెంరాయుళ్లు ఆయుధాలతో దాడి చేయడంతో సెబ్ ఎస్‌ఐ జయరావు గాయపడ్డారు. ఎస్‌ఐని హుటాహుటిన కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వాకాడు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాత్ర-2ను వీక్షించిన వైఎస్సార్ సీపీ నాయకులు

రాపూరు: స్థానిక శ్రీవెంకటేశ్వర మహల్‌లో ఆదివారం యాత్ర -2 చిత్రాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వీక్షించారు. నాయకుల కోసం ప్రత్యేకంగా ఒక షోను ప్రదర్శించారు. జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, తిరుపతి జిల్లా మైనారిటీ విభాగం కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, లీలామోహన్ రెడ్డి, ఘని, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఓజిలి మండలంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు (ఫైల్)



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య (ఫైల్)

ఆసరాతో కొండంత అండ

- అక్క చెల్లెమ్మలకు రూ.140.95 కోట్ల లబ్ధి
- సూళ్లూరుపేట నియోజకవర్గంలో 45,671 మందికి లబ్ధి
- సీఎం జగనన్నకు కృతజ్ఞతలు చెబుతున్న మహిళలు

ఓజిలి: ప్రజాసంకల్ప యాత్రలో డ్వాక్రా మహిళల కష్టాలను నేరుగా చూసిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆసరాగా నిలుస్తానని మాట ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా సంఘాల సభ్యుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పేరుతో నాలుగు విడతలుగా క్రమతప్పకుండా మహిళల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమ చేస్తున్నారు. మొదటి మూడు విడతల్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని 4,664 డ్వాక్రా సంఘాల్లోని 45,671 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.106.95 కోట్లు జమ చేశారు. నాలుగో విడతగా రూ.34 కోట్లు ఇచ్చారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.140.95 కోట్లు మేర లబ్ధి చేకూర్చారు. దొరవారిసత్రంలో 6,034 మందికి రూ.17.80 కోట్లు, నాయుడుపేట రూరల్‌లో 5,489 మందికి రూ.15.08 కోట్లు, నాయుడుపేట టౌన్‌లో 4,595 మందికి రూ.14.36 కోట్లు, ఓజిలిలో 5,896 మందికి రూ.19.20 కోట్లు, పెళ్లకూరులో 6,231 మందికి రూ.17.48 కోట్లు, సూళ్లూరుపేట రూరల్‌లో 5,043 మందికి రూ.13.08 కోట్లు, సూళ్లూరుపేట టౌన్‌లో 4,768 మందికి రూ.16.44 కోట్లు, తడ మండలంలో 7,615 మందికి రూ.26 కోట్ల చొప్పున మాఫీ సొమ్ము జమ చేశారు. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబునాయుడు మోసం చేస్తే జగనన్న ఆదుకున్నారని చెబుతున్నారు. ఇచ్చిన మాటను నిలుపుకున్న మన సున్న మారాజు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కృతజ్ఞతలు చెబుతున్నారు.

రూ.60 వేలు రుణమాఫీ అయ్యింది



డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో క్రమం తప్పకుండా బ్యాంకుల్లో జమచేశారు. నాకు మొత్తం రూ.60 వేల రుణం మాఫీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – ఉచ్చూరు శోభారాణి, రాజరాజేశ్వరి గ్రూపు

సంతోషంగా ఉంది



డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబునాయుడు మహిళలను మోసం చేశాడు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో రుణాలను మాఫీ చేయడం సంతోషకరం. రుణమాఫీ రుణాల పంపిణీలో దళారులు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

– ముపాళ్ల మాధవీలత, గుర్రంకొండ

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి కోరారు. ఆయన ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అందరూ ఐకమత్యంతో ఉండి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, సర్పంచ్‌లు చెంచురామయ్య, వీర కుమార్, రవిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రఘునాయుడు, నాయకులు బాలసుబ్రమణ్యం, మోహన్, చెంగయ్య, లింగమనాయుడు, జితేంద్ర, బాలు, మధుసూదన్‌నాయుడు, మురళి, మునిరాజ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



దెబ్బతిన్న బస్సు ముందు భాగం



చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్ అశోక్





చికిత్స పొందిన ప్రయాణికులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని విన్నమాల సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు నిలబడి ఉన్న లారీని ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్‌తోపాటు 8 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ ఇంద్ర హయ్యర్ బస్సు తిరుపతి నుంచి విజయవాడ మీదుగా ఏలూరు బయలుదేరింది. బస్సులో 26 మంది ప్రయాణికులు ఉన్నారు. నాయుడుపేట సమీపంలోని విన్నమాల కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి రోడ్డు పక్కగా నిలబడి ఉన్న లారీని వెనుక వైపున ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ అశోక్‌తో పాటు ఏలూరు ప్రాంతానికి చెందిన యశోద, విజయ చాముండేశ్వరి, విజయలక్ష్మీ, ప్రసన్న, గౌతమి, భువనేశ్వరి, జ్యోతి స్వరూప నాయుడు, ముత్యాల జ్యోతి గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మధు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరొక బస్సులో గమ్యస్థానానికి తరలించారు. రోడ్డుపై నిలబడిపోయిన వాహనాలను పక్కగా జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కండలేరులో 11.240 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.240 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



పూల అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

నేటి నుంచి కుంభాభిషేకం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని మనులాలపేటలో పునర్ నిర్మిస్తున్న రుద్రమూర్తి మఠం ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ఏర్పేడు: మర్రిమంద ఎస్సీ కాలనీ, బండారుపల్లెలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ జిలానీ మర్రిమంద ఎస్సీ కాలనీలోని చెంగల్‌రాయులు ఇంటిలో సోదాలు చేసి 10, బండారుపల్లెలో నాగరత్నమ్మ ఇంటిలో 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలపై హక్కు

- రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వం
- తనఖా పెట్టుకుని రుణాలు పొందే అవకాశం
- 9 ఏళ్ల తరువాత విక్రయించుకోవచ్చు



హక్కు పత్రాలు అందజేస్తున్న అధికారులు

చిల్లకూరు : పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అర్హులకు నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల పట్టాలు అందజేసింది. ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. బ్యాంకులు, పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న వారికి రూ.30 వేల వరకు రుణ సదుపాయం కల్పించింది. ప్రస్తుతం మరో అడుగు ముందుకు వేసి ఇంటిపై సర్వహక్కులు కల్పించేలా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే కార్యక్రమం చేపట్టింది. ఆయా సచివాలయల్లోనే వీఆర్‌వోల ద్వారా రిజిస్ట్రేషన్ చేసి వాటిని రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుసంధానం చేస్తోంది. తద్వారా ప్రతి లబ్ధిదారూ ఆ పత్రాల ద్వారా ఎక్కడైనా రుణాలు పొందే అవకాశం లభించింది. 9 సంవత్సరాల తరువాత ఏదైనా అవసరం ఉంటే వాటిని విక్రయించుకునేలా హక్కు కల్పించింది. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగం అందుకుంది.

మండలంలోని సచివాలయాలు– 19
లే అవుట్‌లు– 26
తుడా పరిధిలో ఉన్న లే అవుట్లు – 11
లబ్ధిదారులు– 376 మంది
నుడా పరిధిలో ఉన్న లే అవుట్లు – 15
లబ్ధిదారులు – 438 మంది
ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసినది – 412 మందికి

విలువైన స్థలాలు దక్కాయి



ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న మాకు గ్రామ సమీపంలో వేసిన లేఅవుట్‌లో స్థలం ఇచ్చారు. పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నా పేరుతో పట్టాను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారని చెప్పడంతో చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్తులో కుటుంబ అవసరాలకు ఇల్లు ఉందని రుణం తీసుకోవచ్చు.

– పోలమ్మ, ఓడూరు సచివాలయం

పట్టా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారు



మేము అద్దె ఇంటిలో ఉంటూ చాలా ఇబ్బంది పడ్డాం. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు– పేదలందరికీ ఇల్లు పథకం కింద స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకున్నాను. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు ఇస్తున్నారు. దీంతో భవిష్యత్తులో ఇంటిపై రుణం పొందే అవకాశం ఉంది. కష్టాలు తీరనున్నాయి.

– రేవతి, కొమరావారిపాళెం

శర వేగంగా చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు – పేదలందరికీ ఇల్లు పథకం కింద ఇంటి స్థలాలను ఇవ్వడంతో పాటు పట్టాలను లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే ప్రక్రియ చేపట్టింది. మండలంలో పనులు చురుగ్గా చేస్తున్నాం. అన్ని సచివాలయాల్లో వీఆర్‌వోలు దగ్గర ఉండి రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేస్తున్నారు.

– శ్రీనివాసులు, తహసీల్దార్

పరామర్శ

కోట: వైఎస్సార్‌సీపీ నాయకుడు పెనుబోలు దయాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కొత్తపాళెంలో దయాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దయాకర్‌రెడ్డి కుమారుడు వెంకట్రామిరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కె.భక్తవత్సల్‌రెడ్డి, డీ.నాగూర్‌రెడ్డి, ఎన్.బాబురెడ్డి, ఎన్.హరీషచంద్రారెడ్డి, వీ.షనీల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దయాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

నేడు యాత్ర-2 సినిమా ఉచిత ప్రదర్శన

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సంగం థియేటర్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు యాత్ర–2 సినిమాను గూడూరు పట్టణ, రూరల్ ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చని జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, జగనన్న సేవా సమితి వ్యవస్థాపకులు మహేంద్రరెడ్డి తెలిపారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ముఖ్యనాయకులు ఈ సినిమాను వీక్షిస్తారన్నారు. సినిమా ప్రారంభానికి ముందుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేస్తామన్నారు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి గురించి తెరకెక్కించిన ఈ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలనే ఉద్దేశంతో 11 గంటల షోను బుక్ చేసుకున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గూడూరు పట్టణ, రూరల్ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి విశేష పూజలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ, ఆర్యవైశ్య అభ్యుదయ మండలి, శ్రీవాసవీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, గణపతి పూజ, వాసవీ హోమం, మంత్ర పుష్పం, మంగళ హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఉభయదాతలుగా వెంకటసుబ్బారావు, విజయమ్మ, వెంకట సుధాకర్‌రావు, సుబ్బలక్ష్మి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

డక్కిలి: స్థానిక అటవీ శాఖ అతిథి గృహంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇందులో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు పీ దశరథరామిరెడ్డి, వేణు నాయుడు, నాయకులు మాదమాల నారాయణరెడ్డి, ఆదిరెడ్డి మల్లికార్జున రెడ్డి, డీ వడ్డిపల్లి ఎంపీటీసీ ఎస్ చెంచయ్య, మామిడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఎముకల సాంద్రత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు హరి ప్రకాష్

సూళ్లూరుపేట రూరల్ : ఎముకలు బలహీనంగా ఉంటే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హన్విత వైద్యశాల ఎముకల వైద్యుడు లొక్కు హరి ప్రకాష్ తెలిపారు. సూళ్లూరుపేటలోని హన్విత ఎముకల వైద్యశాలలో ఆదివారం ఉచిత డయాబెటిక్ న్యూరోపతి, ఎముకల సాంద్రత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఎముకలు బలంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. హోమియోపతి వైద్యులు నవ్యత తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి సన్మానం



ఎస్పీ పరమేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డిని ఆదివారం నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఒంగోలుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనను తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కరణం రఘునాయుడు, నాయకులు సాగి జితేంద్ర పాల్గొన్నారు.

హోరాహోరీగా విద్యుత్ ఉద్యోగుల క్రికెట్



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగుల క్రికెట్ ఫైనల్ ఆదివారం హోరాహోరీగా సాగింది. మ్యాచ్‌లో ఏపీ ఈపీడీసీఎల్ రాజమండ్రి జట్టు విజయం సాధించింది. ఎన్‌టీటీపీఎస్ విజయవాడ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ శేషారెడ్డి ట్రోఫీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ స్పోర్ట్స్ కౌన్సిలర్ సెక్రటరీ బలరామమూర్తి, బి.సురేష్, కె.రామాంజనేయులు, డీఈఈ ముని రవిచంద్ర, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం





అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా ఆలయంలో అమ్మవారికి పలు అభిషేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. అగ్నిగుండం ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య భక్తులు పెద్దసంఖ్యలో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.